కథానిక

# హరిశ్చంద్రుడి ఆఖరు చర్య

ఓగేటి శివరామకృష్ణ

తెల్లవారుతూ ఉంది. వేసవికాలం అవటంవల్లా అది మంచి నిద్దురపట్టే సమయం అవటంవల్లా వీధివీధంతా వళ్ళుమరచి నిద్రపోతున్నారు.

"దొంగ...దొంగ..."అనే కేక వీధివీధంతా హఠాత్తుగా ఒక్కసారి వినబడింది.

ఎక్కడవాళ్ళక్కడనుంచే హఠాత్తుగా లేచారు "పట్టుకోండి,పట్టుకోండి"అంటూ. కలత నిద్రనుంచి లేవటంవల్ల, యెక్కడకు పరుగెత్తటం అనే సమస్య వాళ్ళకు దానంతటదే వచ్చిపడ్డది. మరోమారు "అడుగో, సందు మలుపు తిరుగుతున్నాడు. పట్టుకోండి"అనటంతో తీరిపోయింది. అంతా నాయుడుగారింటిముందు చేరుకున్నారు.

అందరికంటే ఆలశ్యంగా ప్లీడరు ప్రసాదరావుగారొచ్చారు "పట్టుకొన్నారు గదా! దొంగను" అంటూ.

"పట్టుకున్నాం. దొంగ వెధవ యెక్కడికి పోతాడూ .. కొంచెం ఉంటే కొట్టేసి ఉడాయించేసును సుమండీ ప్లీడరుగారూ"అని రెండంటించారు దొంగకు, నాయుడుగారు!

"నే దొంగతనం చెయ్యటంకోసం రాలేదండోయ్" అని దొంగ బావురుమని యేడుస్తున్నాడు. నిజానికి చూడ్డానికి కూడా దొంగకింద లేడు, నాజూకుగా తెల్ల పైజమా, దానిమీద సిల్కుచొక్కా, సువాసన నూనె పట్టించిన తలకాయి. మరి వాడ్ని దొంగ అని తేలికగా అనేయటం యెల్లాగ?

"దొంగతనం చేయటంకోసరం రాలేదు. ఉద్యోగం చేయటానికొచ్చావ్ కాదూ?" నాయుడుగారే చేయివాచేలా వాయిస్తున్నారు దొరికిన చోటల్లాను. రెండు దవడలమీద అయిదు వేళ్ళూ యెన్నోమార్లు అంటుకు పోయాయి. "చంపేస్తున్నారు బాబోయ్. నే దొంగను కాదు బాబోయ్"అని గోలపెడుతూనే వున్నాడు.

ఇలా రభస జరుగుతూండినా ప్లీడరుగారు, తనకేం తెలియనట్లుగానే మొఖంపెట్టి, "అసలు విషయం యేమిటండీ" అని నాయుడుగార్ని ప్రశ్నించారు.

నాయుడు ప్లీడరుగారికి జవాబు చెబుదామనుకొంటూండగానే దొంగను పట్టుకొనటానికి చేరిన మూకే తమకంతా తెలుసునన్నట్లుగా యెవరికి తోచినట్లుగా వాళ్లు చెప్పసాగారు.

"ఏంలేదండీ. వేసవికాలంకదూ నల్లులమంచాలవటంవల్ల, అంతా క్రిందే పడుక్కొన్నారట. అందువల్ల కొట్టేయటం మరీ మంచిదనుకున్నాడు. ముందుగా నాయుడుగారి భార్యమెళ్ళో చేయపెట్ట బోయాట్ట" అన్నారు ఒకళ్ళు.

"అదికాదండీ! నాయుడుగారు నిద్రపోతున్నారట. ముందాయన దగ్గరకే యీ ధుడు వచ్చాడట, అప్పుడే యేదో శబ్దం అవటంవల్ల నాయుడుగారు కన్ను తెరచి చూశారట. చూస్తే వీడు, ఆయన వీడేం చేస్తాడో చూద్దామని అనుకొంటూండగానే ఆయన అలికిడి విని పారిపోబోయ్యాడట" అని మరొకరు మనవి చేసుకొన్నారు.

"మీరు చెప్పినదేదీకాదు! వీడు నాయుడుగారి దగ్గరకువెళ్ళింది నిజం! ఆయన నిద్రపోతూండగా వరుసగా, తాళం చెవులూ, నాయుడిగారి భార్య నగలూ, ఒకేపట్టున కొట్టుకుపోదామని యెత్తువేశాడు కాని ఆ పప్పుడకలేదు" అని వేరొకరు విపరీతంగా చెప్పారు.

ప్లీడరుగా రిందరు చెప్పిన మాటలూ విన్నారుగాని యెవరు చెప్పిందీ ఆయనకు నిజంగా తోచలేదు. "అసలు సంగతి యేమిటండీ?" మాట్లాడరేం?" అని తిరిగి ప్రశ్నించారు ప్లీడరుగారు నాయుడిగారిని.

"రక్షించండి! బాబూ! నే లేచిన వేళ అలాంటిది కాబోలు నేనెటువంటి దొంగతనం చెయ్యటానికీ రాలేదు. నా సంగతి వింటే మీరే కనికరిస్తారు. అసలు విషయం చెప్పుకోనివ్వండి

బాబూ" అని దొంగ కాళ్ళావేళ్ళాబడి బ్రతిమాలు కొంటున్నాడు.

"దొంగతనం చెయ్యటానికి రాలేదు దొరతనం చేయటానికి వచ్చాడు బుద్ధిమంతుడు. అసలు జరిగిన సంగతిది ప్రసాదరావుగారూ! రాత్రి మా ఆడవాళ్ళతో రెండో ఆట సినిమాకు వెళ్ళి వచ్చాము. నిద్రబద్ధకంలో, బట్టలయినా విడవకుండా, మంచాలయినా, తెచ్చుకువాల్చకుండా, చాపలమీదే పండుకున్నాం ఆరుబయట. ఈ ప్రబుద్ధుడు యెప్పుడు వచ్చాడో యేమో. మా పెద్ద కుర్రవాడిదగ్గర పడుకొని ఉన్నాడు. ఏమో ఎవరో తెలియని పరిస్థితుల్లో వాణ్ణి చూశాను, పడుకొన్నాను. తిరిగి లేచి చూచేసరికి వాడు మా ఆడవాళ్లదగ్గర కెళ్ళి మొఖంలోకి తొంగితొంగి చూస్తున్నాడు దొంగవెధవ కాకపోతే అంత తొంగితొంగి చూడవలసిన అవసరం యెందు కేర్పడుతుంది. అందులోనూ, పరాయి వెధవ, నా గుమ్మంలో పరుండటానికి వీలెక్కడ ఉంది. మీరే చెప్పండి ప్రసాదరావుగారూ?" అన్నారు నాయుడుగారు.

నాయుడుగారు చెప్పటం పూర్తవటంతోటే, ప్లీడరుగారు దొంగవైపు చూశారు.

"నాకస లాలాటి దుర్బుద్ధి లేనేలేదు బాబూ! మాది గుంటూరు జిల్లా, మావాళ్లతో పోట్లాడి, వాళ్ళతో ఉండటం యిష్టంలేక-వచ్చేస్తున్నాను బాబూ! చాకలాళ్ళ కుర్రాడ్ని బాబూ!"

"మరి నీకీ ఊళ్ళో యెవరయినా చుట్టాలున్నారా?" ప్రసాదరావుగారు మధ్య ప్రశ్న వేశారు.

"లేరు బాబూ!"

"మరి ఈ వూరెందుకు వచ్చావ్?"

"దొంగతనం చేయటానికి"-నాయుడుగారు నవ్వుతూ అన్నారు.

"ఏం?"—

"కాదు బాబూ! బయలుదేరినప్పటికీ నా దగ్గర చిల్లి డబ్బు లేదు. టిక్కెట్టు లేకుండా రైల్లో వస్తూంటే యీ స్టేషనులో పట్టుబడ్డానండి. నాలుగు తన్ని వదలివేశారండి."

"అలాగా!"ప్లీడరుగారు కొంచెం ఆలోచించసాగారు. "వీడి మాటలు నమ్మకూడదు ప్రసాదరావుగారూ!"ముందుగానేనాయుడుగారనేశారు.

"ముందతని సంగతి విచారించనివ్వండి."

"నువ్వు దొంగతనం చేయటానికి రాలేదు కదూ?" కొంటెగా నవ్వుతూ ప్రసాదరావుగారన్నాడు.

"నాకేలాటి దుర్బుద్ధీ యింతవరకూ పుట్టలేదండి. మీరేం ప్రమాణికం చేయమంటే అది చేస్తాను!"

"ప్రమాణాలకేం! ప్రాణంకోసం వేయి చేయవచ్చు. దొంగవెధవ! కబుర్లు పొట్టనిండా ఉన్నాయ్." అన్నాడు చుట్టూ మూగిన వాళ్లల్లో ఒకడు.

"ఆ...ఆ...అవును"—అన్నాడు నాయుడుగారు!

"అసలు వాడు చెప్పేదేదో చెప్పనివ్వండి. ముందు మీరే ఖంగారుపెడితే యెల్లాగ?".ప్లీడరుగారు ఒకమాట అనటంతో అంతా నిశ్శబ్దంగా ఊరుకొన్నారు.

"మరయితే యీలాగ యెందుకు వచ్చావు?"

"నామాట నమ్మరుకదండీ" బిక్కమొఖం పెట్టాడు దొంగ! "నమ్మటానికేం అసలు సంగతి చెప్పు!" ప్లీడరుగారు బిక్కనవ్వు నవ్వి అన్నారు.

"రైల్లో యేలానూ దిగిపోయాను కదా అని యీవూళ్ళో యెక్కడయినా నౌకరీ చేసుకొందామనే ఉద్దేశంతో రాత్రి పదకొండుగంటలనుంచీ తిరగటం ప్రారంభించాను. రాత్రివేళ నౌకరీ సంగతి అడుగుతే యెవరయినా "దొంగ దొంగ" అంటారేమోననే భయంతో యెవళ్ళనీ మాత్రం అడగలేదండి. ఊరంతా, తిరిగి యిక్కడకు వచ్చేసరికి రెండున్నరగంట లయిందండి. ఇక్కడ బయట వీరు పడుక్కొన్నారండి. ఇంటివాళ్ళు ఆలా క్రింద పడుకోరని, వాళ్ళూ నాబోటి ప్రయాణీకులే అని ఉద్దేశించి ఖాళీగా ఉన్న ఒక ప్రక్కపడుకొన్నానండి బద్ధకంగా ఉండి. వీరు లేస్తే నన్ను గురించి యేం చెడ్డగా ఊహిస్తారో అని మధ్యలో కలిగిన భయంవల్ల లేవకుండా వెళ్ళిపోదామనుకొన్నానండి. ఆ ఉద్దేశంతోనే, అయ్యగారి దగ్గరకూ, అమ్మగారిదగ్గరకూ వెళ్ళి చూసానండి ఈ లోపుగా యింత గొడవ జరిగిందండి. నేను నిజంగా ఏం యెరగనండి! అసత్యం ఆడితే యిప్పుడే చచ్చిపోతానండి కులానికి తక్కువవాడినే అయినా చదువు సంధ్యలు లేక

పోయినా, ఆలాంటి చెడ్డబుద్ధు లింతవరకూ నాకు పుట్టలేదయ్యగారూ నామాట నమ్మండి! నన్ను రక్షించండి"—దొంగాడు యేడుస్తున్నాడు.

"పేద అరుపులు బాగా అరుస్తున్నాడు. అంతా అనుభవం!" అన్నారు నాయుడుగారు!

ప్రసాదరావుగారొక్క చిరునవ్వు నవ్వారు.

"ఏమంటారు ప్లీడరుగారూ!" — అక్కడ వాళ్ళల్లో ఒకరు ప్రశ్నించారు.

"ఏమనే దేముంది! పోలీసు స్టేషనుకు తీసుకు వెళ్ళి అప్పగించటమే!"

"అలా ఖంగారుపడతా రెందుకయ్యా ఉండండి. సరే అయితే మీవూరు పంపించివేస్తే తిరిగి వెళ్ళిపోతావా?"—ప్లీడరుగారు ప్రశ్నించారు.

"వెళను గానండి...దెబ్బలాడి వచ్చాను. తిరిగి వాళ్ళకు మొఖం చూపించలేనండి! గంజో కసరో సంపాదించుకొనే బ్రతకాలనిఉన్నదండి!"

"అయితే నిన్ను ఖైదుచేయటం తప్పదు!"—ప్లీడరుగారే అన్నారు.

"అయితే వెళ్ళిపోతానండి! ఈ చెడ్డ పేరు కన్న అదే నయమండి!"

ప్లీడరుగారు ఆలోచిస్తూ అన్నారు! "నువ్వేం పని చెయ్యగలవ్?" అని.

"నే చదువుకొన్న చదువు చాలా తక్కువండి. సంతకంచేసేంతవరకే నాకు చదువు వొచ్చునండి. మీబోటిప్రభువులదగ్గర నౌకరీచేసుకొని బ్రతకాలనుందండి."

"సరే అయితే!"

"వీడు దొంగ కాదంటారా?"—అక్కడ వాళ్ళలో ఒకళ్లు అన్నారు.

"ఏమైనాసరే. వీడ్ని పోలీసుస్టేషనుకప్పగించి తీరాలి!"

"దొంగ కాకుండానే! ఏమిటయ్యా! నాకా ఖంగారు?" నాయుడిగార్ని ప్లీడరుగారు కసురుకున్నట్లుగా అన్నారు.

"వీడు దొంగ కాదంటారా?"

"అవును. దొంగ అయితే, అంత తెల్లవారే దాకా ఉంటాడా?..." ప్లీడరుగారేమో చెప్పబోయ్యారు!

"వీడిమీద కేసుపెట్టి, వీడి అంతు తేల్చుకుంటాను...ప్లీడరుగారూ..."అన్నారు నాయుడుగారు.

ప్లీడరుగారికి కోపంవచ్చింది: "మీరు వాడిమీద కేసుపెడితే, నే వాడితరఫున వాదిస్తాను. వీడు దొంగ కాదనటానికి నాకు బోలెడు ఆధారం ఉంది."

నాయుడుగారు తగ్గిపోయారు! సర్వసాధారణంగా ప్లీడరు ప్రసాదరావుగారు చేబట్టిన కేసేదీ ఫేలవదు. ప్రత్యేక అభిమానంతో ప్లీడరుగారు నాయుడిగారిమీదకు కయ్యానికి కాలు దువ్వుతున్నారన్నమాట. సర్వత్రా మంచిపేరు సంపాదించుకొన్నా—ప్లీడరు ప్రసాదరావుగారితో యీ సందర్భంలో తగవుపెట్టుకోటం—తమ అభివృద్ధిని పాడుచేసుకోటం; అంతేకాదు, క్రితం నాయుడుగారు ఓడిపోబోతున్న కేసులో, ప్రసాదరావుగారి చాకచక్యంవల్ల నెగ్గటం తటస్థించింది. పైగా ప్రసాదరావుగారప్పుడేమీ యివ్వబోతే పుచ్చుకోలేదు. "ముందుచూదాంలెండి!" అన్నారు. మరి యిప్పుడాయన మాటకెదురునడవటం, ఆయనతో విరోధం తెచ్చుకోనటంకాదూ!

నాయుడుగారు తగ్గిపోయి: "వాడు దొంగ కాదంటారా?"—అన్నారు.

ప్లీడరు నవ్వుతూ: "మీకా అనుమానం యెందుకు. నే చాలాదూరం యోచించాను. వాడి మనస్తత్వం కనిపెట్టాను. వాడికాలాంటి దుర్బుద్ధులున్నట్లు కనపడలేదు. పారిపోయి వచ్చానని వాడే చెబుతున్నాడు"అన్నారు.

"సరే మీ యిష్టమొచ్చినట్లు చెయ్యండి!" లోపల బాధగా ఉన్నా ప్లీడరుగారికోసం—ఆ మాటనన్నారు నాయుడుగారు.

దొంగ చేతులెత్తి, ప్లీడరుగారికి నమస్కారం చేస్తూ: "మీ మేలుమర్చిపోలేను బాబూ! చచ్చినంతకాలం మీ సేవచేసుకొంటాను"అన్నాడు.

"రెండుపూటలా భోజనం పెడ్తాం, మా యింటిదగ్గరపనిఉంది. పైన ఏమైనా ఇస్తూంటా. నీకిష్టమయితే రా, నువ్వు చచ్చినంతకాలం సేవ చేసినట్లే"అన్నారు ప్లీడరుగారు నవ్వుతూ.

"చిత్తంబాబూ!..."అన్నాడు దొంగ.

నాయుడుగారు తెల్లబోయారు, ఎక్కడివాళ్లక్కడకు తోచినవిధంగా అనుకుంటూ వెళ్ళిపోయారు.

అప్పటికే ఉదయం ఆరుగంటలయింది.

* * *

ఈ సంఘటన జరిగిన రెండు మాసాల తర్వాత, నాయుడుగారు ప్లీడరు గారింటికి రావటం తటస్థించింది. దొరికిన దొంగను విడిపించినందుకు లోపల బాధపడుతూన్నా నాయుడుగారికి, స్వంతపని మూలంగా, ప్లీడరుగారింటికి వెళ్ళటం తప్పనిసరియైంది.

"రాముడిని వదిలించినందుకు మీ మనస్సు చాలా బాధపడుతున్నదనుకొంటాను. మా వైపు చూడటం కూడా మానివేశారు!" అన్నారు ప్లీడరుగారు.

నాయుడుగారు మాత్రం. "ఆ, ఆ రాము డెవరూ?" అన్నారు.

"రాముడా! రాముడు. మీ దొంగ!" ప్లీడరు గారొక్కమారు నవ్వారు.

"అబ్బే. నాకాలాంటి బాధేంలేదే! వాడిపేరు రాముడేమిటి?" దొంగ నవ్వు ప్రదర్శించాడు నాయుడుగారు.

"ఊ... వాడు చాలా నమ్మకస్తుడులెండి! ఆ సంగతి అప్పుడే ఆ కొద్ది నిముషాల సంభాషణలలోనే తెలుసుకొన్నాను. వాడి మనస్తత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకొన్నాను. వాడి కాలాంటి దుర్బుద్ధి యిదివరకులేదు; ఇప్పుడూ లేదు, మరి ముందుగూడా ఉద్భవించబోదు!" అన్నారు ప్లీడరుగారు.

నాయుడుగారు నవ్వుతూ, "మూడు కాలాలకూ పందెంకట్టారే! ఏమయినా మేం మీలాంటి మనస్తత్వం తెలిసిన వాళ్ళం కాదుగదా! ఏదో గుడ్డి దర్చారు. మేం తవ్వుకున్న గోతిలో మేమే పడేవాళ్ళం" అన్నారు.

ఇంతలో రాముడు "అయ్యగారూ!" అంటూ అక్కడకు వచ్చి, నాయుడుగార్ని చూచి తెల్లబోయాడు.

"ఏంరా రాముడూ ఏం?" అన్నారు ప్లీడరుగారు.

"ఇందాక నీళ్లపోసుకుంటూ రూపాయి చిల్లర మార్చి, యెవరికో యిచ్చారు కదండీ! దాని బాపతు డబ్బులక్కడ పెట్టేసి వచ్చారండి. అవి ఇవుగోనండి" అని ప్లీడరుగారికిచ్చాడు రాముడు.

"దొంగిలించక పోయావ్!" నాయుడుగారన్నారు.

"అలాంటిది మా ఇంటావంటా లేదుబాబూ!" రాముడన్నాడు.

"చెప్పావుగా నాయుడుగారూ! వాడిని చూచినప్పుడే నాకు వాడిమీద అపారమైన జాలి కలిగింది! వాడి మాటలనుబట్టి వాడి మనస్తత్వాన్ని అర్థంచేసుకొన్నాను. అలాటి దుర్బుద్ధులున్న రకం కానట్లుగా నాకు పూర్తిగా తెలిసింది. అందుకనే మీతో యుద్ధం పెంచుకోటానికి కూడా వెనుదియ్యలేను!" ప్లీడరుగారి మాటలు అని ఒక నవ్వు నవ్వారు.

నాయుడుగారు రాముడు వైపు చూశారు. రాముడు చేతులు కట్టుకు నిల్చున్నాడు; వాడి కళ్ళల్లో నీళ్లు నిల్చాయి. నాయుడుగారి కళ్లు కూడా హఠాత్తుగా చమర్చాయి.

రాముడివైపుచూస్తూ, "నీగురించి అపోహ పడ్డందుకు మరేం అనుకోకు. రాముడూ! ఆ సమయం అలాంటిది. ప్లీడరుగారు మనస్తత్వవేత్త, గనక ఆయన తేలిగ్గా నిన్నుగురించి ఊహించారు. చదువు సంధ్యలులేని నాకేం తెలుసు! మనస్సులో నిన్ను దొంగచేసినందుకు వీలయినప్పుడు నామీద కక్షమాత్రం సాధించకు"— అన్నారాయన.

రాముడు తల వంచుకొనే "నేనేం చేయగలనండీ"—అన్నాడు. ప్లీడరుగారు "ఒరేయ్ రాముడూ! క్రితం కేసుబాపతు అయిదువందలు యీవాళ యిస్తానన్నారు రామారావుగారు. నిన్ను పంపిస్తానన్నా వెళ్ళి తీసుకురా" అన్నారు.

రాముడు వెళ్ళిపోయాడు నాయుడుగారు మాత్రం: "ఎందుకయినా మంచిది. కొంచెం జాగర్తగా ఉండండి" అన్నారు!

"ఆ...భయంలేదు!"—అన్నాడు ప్రసాదరావుగారు నవ్వుతూ తర్వాత మరో విషయంలోకి వారి సంభాషణ దారి తీసింది.

మరో రెండుమాసాలకాలం దొర్లిపోయింది. ఇప్పుడు రాముడు ప్రసాదరావుగారితల్లో నాలిక విధంగా మసులుకుపోతున్నాడు. ఆయనకు రాముడిమీద యెడతెగని అభిమానం అంకురించింది. ప్రసాదరావుగారికి రాముడు, ఇంట్లో పిల్లలతో సమానుడైనాడు. చిన్న విషయాల్లో సహితం రాముడికి ప్రత్యేకత గుర్తింపచేవారు ప్రసాదరావుగారు.

ప్రసాదరావుగారి కుటుంబం సినిమా కెడితే రాముడూ వాళ్ళతో హాజరే! పండుగలకు కొత్త

బట్టలు పిల్లలకు కుట్టిస్తే, వాటిలో రాముడికి వాటా ఉండేది. ఇక్కడ రాముడు ప్రవేశించి నప్పటి నుంచీ, రెండుమూడు జతలు ప్రసాదరావుగారు స్వయంగా కుట్టించారు. రాముడు సాదరు ఖర్చుకు లోటు లేనేలేదు. అందరితోపాటూ రాము డూను.

ప్రసాదరావుగారు తన్ను కలుసుకో వచ్చిన ప్రతీ వాళ్ళతోటీ రాముడినిగురించి రాముడి ప్రవర్తనగూర్చి చెబుతూండేవారు. రాముడిని గూర్చి ప్రసాదరావుగారితో మంచిగాను, చెడ్డ గానూ అన్నవాళ్లు చాలామంది ఉన్నారు. కాని రాముడినిగురించి ప్రసాదరావుగారి అభిప్రాయం మాటా ఒక్కటే! రాముడు సహృదయంగల వాడు, ఒకళ్ల సొత్తుకోసం యెదురుచూచేవాడు కాదు. చాలా పిరికివాడు ఇదీ ఆయన రాముడిని గురించి గ్రహించిన మనస్తత్వం.

ఒకమారు ప్రసాదరావుగారికీ, నాయుడుగారికి రాముడు విషయంలో మాట మీద మాట వచ్చిందిగూడాను! నాయుడుగారు రాముడికి డబ్బిచ్చి బ్యాంకులకు పంపటం, ఒకళ్ళ కిచ్చి రావటం, ఇవ్వవలసింది తెప్పించుకోటం, ఈ పను లన్నీ చేయటం, తన కిష్టంగాలేదని, ఏదో పట్టి నట్లుగా రాముడుండగానే నాయుడుగారన్నారు.

ప్రసాదరావుగారికి కోపం ముంచుకొచ్చింది. అయినా ఆయన ఓపికతోనే జవాబిచ్చారు. "మీరు చెప్పింది నేగ్రహించాను. మరేం భయం లేదు లెండి" అని.

"అదికాదండీ! నా మాటలు వినండి. ఎవరి డబ్బు సంగతి వారు చూసుకోటం మంచిది కాదండీ!" నాయుడుగా రింకా విపులీకరించి మాట్లాడబోయారు.

రాముడు తెల్ల బోయాడు.

"చూడండి! నాయుడుగారూ! జరిగిందేదో జరిగిపోయిరిది. అనవసరంగా మీరు నా విష యాల్లో కలగచేసుకోండి. స్నేహ కీత్యా మీరు వస్తే మంచిదే. కాని నాకు సలహాలివ్వ నవసరం లేదు. నా మంచి నాకు తెలుసు. నా గొయ్యి నేనే తవ్వుకొంటున్నానని మీ రనుకొన్నా సరే! మరి మీరు ఈ విషయం...యెత్తితే చాలా తీవ్రంగా మాట్లాడవలసి వస్తుంది"-ప్రసాదరావుగా రింత తీవ్రంగా మాట్లాడటంతో, నాయుడుగారు తెల్లబోయ్యారు. నాయుడుగారికి ప్రసాదరావు గారి ద్వారా జరగవలసిన పనొకటున్నది. అందు వల్ల ఆయన తీవ్రంగా పోక, "మీ యిష్టం కలుగ చేసుకోవద్దంటే యెందుకు కలగచేసుకుంటాం! స్నేహరీత్యా మీతో మాట్లాడటంగాని, యుద్ధం చేయటానికి కాదుగా! ఆ ఉద్దేశం ఉంటే రాముణ్ణి జైల్లో పెట్టించే ఉందురు" అన్నారు.

ప్రసాదరావుగారు కూడా ఒక్క నవ్వు నవ్వారు. తర్వాత జరిగిన యీ రెండు మాసా ల్లోనూ, నాయుడుగారు ప్రసాదరావుగారితో మాట్లాడటం తగ్గించుకొన్నారు.

కాని, ఆ రోజున, అత్యవసరమైన పని వుండ టంవల్ల, పాత కథ మరచి, తిరిగి నాయుడుగారు ప్రసాదరావుగారింటికి రావటం జరిగింది.

వీధి అరుగుమీద నిల్చుని యేమో ఆలోచి స్తున్న రాముడికి, నాయుడుగారు కనిపించారు. వెంటనే వాడు తెల్లబోయాడు.

"ప్లీడరుగా రున్నారా?"

"ఉన్నారు-రండి!" నాయుడుగారు లోపలి కొచ్చారు.

ప్లీడరుగారేవో నోట్లు లెక్కపెడుతున్నారు.

"హడావిడిగా ఉన్నట్లున్నారు?" అంటూ నాయుడుగారు ప్రక్కకుర్చీలో కూర్చున్నారు!

"ఆ...లేదండి. మొన్న అవసరానికి, నారా యణరావుగారి దగ్గర, మూడు వేల చిల్లర తెచ్చాను. ఇప్పుడు డబ్బుండింది. ఇచ్చేద్దామని... రాముడూ!"

"మీ ప్రియమైన విధేయుడు" క్రింద రాముడు చేతులు కట్టి నిల్చున్నాడు.

"సిల్కుచొక్కా తొడిగావేమిటి? నాయుడు గారూ, చూశారా...వీరు రాముడిని దొంగ చేసిన చొక్కా."

"అవునండి" నాయురుగారు నవ్వారు.

"బట్టలన్నీ మాసినాయండి!" రాముడన్నాడు తలవంచుకొని.

"నువ్వు వెళ్ళి యీ సొమ్ము-మూడు వేలు- మొన్ననే తెచ్చానులే. నారాయణరావుగారిదగ్గర ఎరుగుదువుకదూ! ఆయనకు నేనిచ్చానని ఇచ్చిరా."

"వాదో మాట!" నాయుడుగా రన్నారు.

గ్రహించినట్లుగా ప్రసాదరావుగారు నవ్వుతూ: "మీ మాట యేమిటో నాకు తెలుసు.

రాముడిచేతికి డబ్బివ్వద్దనీ, నన్ను స్వయంగా పోయి జమకట్టుకోనమనేగా! భయంలేదులెండి."

"మీ కిదివరకు చెప్పవద్దన్నా చెబున్నందుకు మన్నించండి! ఇది డబ్బుతోపని."

"ఈ ప్రశ్నకు జవాబుకూడా నే మీకిదివరకే చెప్పాను, పోరా...రాముడూ...అలా నిల్చుండి పోయావేం?"

"వారు యేమో అంటున్నారుగదండీ, పోనీ వీలయినప్పుడు మీరేయిద్దురుగాని లెండిబాబూ!" తీవ్రంగా నాయుడిగారివయిపుచూస్తూ అన్నాడు రాముడు.

"వారు చెప్పటం యేమిటి? డబ్బు నాదయినప్పుడు నువ్వు నా నవుఖరువు ఊc వెళ్లు."

"సరేనండి!" అని రాముడు లోపలికెళ్లి బట్టలమూటతో తిరిగివచ్చాడు.

"ఆ మూటేమిటి?"

"బట్టలు మాసినాయండి. లాండ్రీకేసుకోండామని."

"సరే పోయి త్వరగా రా!"

"అలాగేనండి!" రాముడు డబ్బుతో వెళ్లాడు.

నాయుడుగారు మనస్సు పీకుతున్నా, ప్లీడరుగారన్న మాటను పునస్కరించుకొని యేం అనలేకపోయారు! వారు తమకు సంబంధించిన విషయాలు మాట్లాడుకొన ప్రారంభించారు.

* * *

పదిన్నరగంటలయింది. ప్లీడరుగారు బట్టవేసుకు కోర్టుకువెడుతూ యధాలాపంగా "రాముడింకా రాలేదూ?"అని యింట్లోవారిని ప్రశ్నించారు. రాలేదని జవాబువచ్చింది."ఊళ్లోతిరుగుతున్నాడు కాబోలును"అంటూ ప్లీడరుగారు కోర్టుకు వెళ్లి పోయారు.

సాయంకాలం అయిదున్నర గంటలకు తిరిగి, కాఫీత్రాగి, పేపరుచూస్తూ యధాలాపంగా "రాముడూ!"అని పిల్చారు. "రాముడు రాలేదు" ఇంట్లోంచి జవాబు వచ్చింది.

ప్రసాదరావుగారిప్పుడు హడావిడిపడుతూ లేచి, నారాయణరావుగారింటికెళ్ళి, "రాముడొచ్చాడా"అని అడిగారు. "రాలేద"ని జవాబు వచ్చింది.

ప్లీడరుగారు తెల్లబోయ్యారు. ఎంతపని జరిగింది. తాను రక్షించిన రాముడే తన్ను గోతిలోకి దించాడా? తాను తవ్వుకొన్న గోతిలో తానే పడ్డాడా?

ప్లీడరు తర్వాత, పోలీసు రిపోర్టు యివ్వటం, గుంటూరుపోయి, అక్కడ రాముడుకోసం ప్రయత్నించటంజరిగింది. అయితేరాముడిదా ప్రాంతం అయితేగా కన్పించటానికి...

---

మహాత్మా గాంధినిగురించి మరి మూడు క్రొత్త గ్రంథాలు అమెరికాలో ఇటీవలే ప్రచురించబడ్డాయి. "క్రిస్టియన్ సైన్సు మానిటర్"పత్రిక ఆ గ్రంథాలను సమీక్షిస్తూ ఇలా వ్రాసింది:

"రెజినాల్డు రైనాల్డ్సు వ్రాసిన 'గాంధీ తత్వాన్వేషణ' అనే గ్రంథంలో 1929 లోను, 1949 లోను రచయిత ఇండియావెళ్ళి మహాత్మాగాంధి సమక్షంలో గడించిన అనుభవాలు క్రోడీకరించబడ్డాయి. భారతదేశంలోని గ్రామసీమలలో సంఘ సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, ప్రాతిపదిక విద్యను అమలుపరచడానికి మహాత్మ గాంధి మహత్తరమైన కృషి చేశారని రైనాల్డ్సు అభిప్రాయం."

మహాత్మా గాంధిని అనేకసార్లు సందర్శించిన రైనాల్డు డంకన్ "మహాత్ముని సిద్ధాంతాలు, ఉపదేశాలు" అనే మరొక గ్రంథాన్ని రచించారు. మానవుడు భౌతిక చింతను తగ్గించుకొంటే నైతికప్రమాణాలు పెంపొందగలవనేది మహాత్మా గాంధి సిద్ధాంతాలలో ముఖ్యమైనదనికూడా రైనాల్డ్సు పేర్కొన్నారు.

హోమర్ జాక్ "మహాత్ముని జ్ఞానభోధలు"అనే మరొక గ్రంథాన్ని రచించారు. మహాత్మాగాంధి జీవితంపై రస్కిన్, టాల్‌స్టాయ్, హిందూమతగ్రంథాల ప్రభావం ఎక్కువగా వున్నదని రచయిత పేర్కొన్నారు.